# పదిలమమ్మా చెల్లెమ్మా

కలవారికే అంకితం
కళావనికే కళంకం
సమ సమాజం ధ్యేయం
సకల కళా ప్రభంజనం
చైతన్యం మా సాధన
విప్లవమే మా ధ్యేయం

ఆవేశంతో కళ్ళనీళ్ళు వచ్చేయి గౌరికి. ఉద్రేకస్థాయి భరించలేనట్లు ఓ క్షణం తలదించుకొని కూర్చుండిపోయింది. ఆ పాట తాలూకు ప్రభావం లోంచి బయటపడ లేనట్లు గుడిసెలో ఎవరూ ఏం మాట్లాడలేకపోయారు. ముసలి బసవడు ముందుగా తేరుకున్నాడు.

"ఓలమ్మీ....ఎంత సిత్రాలుగా పాడితివే. యశోదమ్మ నేరిపిన పాటలేగా. ఇంత గుంటగా వున్నప్పటినుంచీ దగ్గరకు తీసి పెంచింది. నల్లని తల్లి....ఏదేదీ ఇంకో పాటెత్తుకో"

గౌరి అత్త బ్రతిమాలించుకోకుండా గొంతు విప్పింది.

"పదిలమమ్మా....చెల్లెమ్మా
పదహారేళ్ళొచ్చేయీ...."

తీగలు మీటినట్లుగా గొంతుతో మృదువుగా వంపులు తిరుగుతోంది ఆ విప్లవ గేయం. నల్లగా పోతపోసిన విగ్రహంలా, తీర్చిదిద్దిన నల్లరాతి ప్రతిమలా గుడి

లోంచి నడిచి వచ్చిన దేవత రూపంలా వుంది గౌరి. భుజాలు దాటని నొక్కులజుట్టు తీరుగా వున్న కళ్ళు, ముక్కు, పదహారేళ్ళ యవ్వనం ఆ చిన్నారికి తగనిఅందాన్ని ఇచ్చేయి. పదిహేను రూపాయిలకు మించని వాయిల్ చీరెతో యవ్వనం ఇచ్చే మిస మిసలతో అందంగా వుంది గౌరి. ఆ అమ్మాయివైపు ప్రేమగా, ఇష్టంగా కోరికగా చూస్తున్నాడు సాంబడు, గౌరి భర్త. ఇరవై దాటని వయసుతో వూహ తెలిసినప్పటి నుంచి కాయకష్టం చేస్తూ, కండలు తిరిగిన శరీరంతో వున్నాడు సాంబడు. సాంబడు గౌరి చూడచక్కని జంట. ఆ పిల్ల చక్కగా పాడుతుందని, సోషల్ వర్కర్ యశోదగారు ఇచ్చే ప్రోగ్రామ్‌లో గౌరి పాటలే అందరూ ఇష్టపడతారనీ, గౌరి అంటే అందరికీ ఎంతో అభిమానమని తెలుసు సాంబడికి. అల్లాంటి గౌరి తన స్వంతం అనుకుంటే ఇంకొంచెం గర్వం మనసులో. వాల్చివున్న నులకమంచం మీద అల వోకగా వాలి చూస్తున్నాడు భార్య వంక. ఆ అమ్మాయి ఆ గుడిసెకి వచ్చి రెండు నెలలే. ఇంకొంచెం సేపట్లో ఆ ఇంట్లో ముసిలి బసవడు, సాంబడి అన్న సుబ్బడు చేను కాపలాకు వెళ్ళిపోతారు. ఈ గుడిసె చుట్టుప్రక్కల వున్న పాతిక ఎకరాలు కాస్తూ, ప్రక్కనేవున్న గౌరితో మాట్లాడుతూ, అది పాడితే వింటూ, ఆడితే చూస్తూ, అనంతిస్తూ వుండడం సాంబడికి యిష్టం. లాంతర్లు వెలిగించి పెట్టేరు. పదకొండు దాటేకా చుట్టూ పొలాలకాపలాకు వెళ్ళాలి వాళ్ళు. అందుకే ఆ పొలాల మధ్య నిర్మా నుష్యంగా వున్నచోట గుడిసె వేసుకున్నారు యానాది బసవడు, అతని కుటుంబం.

భార్యపోయాక, పెద్దకొడుకు సుబ్బడి భార్య బాలింత రోగంతోపోయాక, చాలా కాలం తరువాత సాంబడివి చేసుకుని ఈ యింట దీపం పెట్టేందుకు వచ్చింది గౌరి. అందుకే ఆ పిల్లను చూస్తే బసవడికి ప్రాణం.

పాట అయిపోతూనే లేచి లాంతరు అందుకున్నాడు బసవడు. గుడిసె తడి కకు ఆనుకొని దుప్పటి ముసుగులోంచి దీక్షగా గౌరి ప్రతికదలికను గమనిస్తూ వున్నాడు సుబ్బడు. ఆ పిల్ల మధురమైన గొంతేకాదు. చక్కని కళ్ళు, పొందికైన అవయవాలు అన్నీ నచ్చేయి వాడికి. దుప్పటిలోంచే ఓసారి తలతిప్పి తమ్ముడి వేపు చూచాడు. దావిటిలో పడుకున్న సాంబడు నిద్రపోతున్నట్లు కనిపించాడు.

"బందెదవ...ఈడికి పెళ్ళాం ఎందుకూ. ఏ గడియలో సూసినా నిద్రలోనే నస్తా వుంటాడు...."

మనసులోనే తిట్టుకున్నాడు. పెద్దవాడయిన తండ్రి, అన్నలయుండు భార్యతో సరసాలు, కబుర్లు, ఇలాటివి చేయటం సాంబడికి ఇష్టం వుండదు. గౌరి చిన్నది. ఇంకా ఇంటికి అలవాటుపడలేదుకనుక నెమ్మదిగా, సిగ్గుగా వుంటుంది.

"పల్లె పల్లె గుడిసె నడుమ
పొడిసె కొన్న నందమామ

పల్లె, పల్లె రాజూకుని, ఓ రాజయ్య
కొలిమంటుకున్న జాడరో ఓ రాజయ్యా."
పండగొస్తే, పబ్బమొస్తే సంబరవే లేదాయే
ఉపవాసపు బతుకులాయనో రాజయ్యా
ఉరి బోసక సత్తనంటివో "రాజయ్యా"

అంటూ గౌరి గొంతెత్తి పాడుతోంటే సుబ్బడికి దుప్పటి అవతలపారేసి, ఆ పిల్లను ఎత్తుకొని సుదూరతీరాలకు పోవాలనిపించింది. తమ్ముడు, తండ్రి ఎదురుగా కనబడుతూ అతని ఆవేశం చల్లబరిచేరు. నీరసంగా లేచి లాంతరు అందుకున్నాడు.

ఇంతలో "రొట్టె ఇమ్మందువా బావయ్యా" అన్నది గౌరి.

"మీకింకా గావాలంటే తడిపిన పిండి ఇంకా అట్టే వుంది. రెండు గాల్చి పెడతా...."

"నీవు గాల్చి పెడతనంటే ఆడు అట్టనే కూకుంటడు. దూరం పొలం, సెరువు గట్టున ఓపాలి బోయి రావాల. నేనంతదూరం జోలేను. సువు నడవరా సుబ్బా...." బసవడు కసురుకున్నాడు.

అన్న నడవకుండా వెళ్ళాలా, రొట్టెలు దినాలా అన్నట్లు చూడడం గమనించి సాంబడు లేచి నిలుచున్నాడు.

"నే పోయొస్తనయ్యోవ్. అన్నని రొట్టెలు దిన్నీ. ఎంతసే పొస్త...." లాంతరు చేతిలోకి తీసికొన్నాడు.

"ఇందాక, పది రొట్టెలు తిన్నాడు. ఈ తిండి పిచ్చి పాడుగానూ, దరిద్రం వున్నాడికి ఆకలి ఎక్కువంట" తిట్టుకుంటూ కర్ర చేతిలోకి తీసుకొన్నాడు.

గౌరి చిన్ని పెదవులు నవ్వుతో విచ్చుకున్నాయి. బుడ్డి దీపం లాంతరులో ఆ బుగ్గల్లో మెరుపులు, ఆ తెల్లని సన్నటి పళ్ళు, సిగ్గుతో ఓ ప్రక్కకి తిప్పుకున్న తల మనోహరంగా కనిపించేయి సుబ్బడికి. చూపు తిప్పుకోలేనట్లు ఆమె వైపే చూస్తూ వుండగానే సాంబడు, బసవడు వెళ్ళిపోయారు. చితుకుల మంటతో ఆ గుడిసెలోకి ఇంకొంచెం వెలుతురు వచ్చింది. ఆ మంటల వెలుగులో, రొట్టెలు చేసే చేతులు, పచ్చని గాజులు, బిగువుగా వున్న రైక, మడత పడ్డ చిన్న పొట్ట, పొందికగా చీర,బిగువుగా లాక్కునికూర్చున్నతీరు నిగనిగమెరిసే పిక్కలు ఇవన్నీ సుబ్బడిని కళ్ళతో, పూరిస్తూ, మోహం రేపుతూ వుంటే పొయ్యిమీద రాతిపెనం పెట్టి నాలుగు సజ్జరొట్టెలుకాల్చి, మూకుడుతో తెచ్చి అందిస్తే ఆ మూకుడుతోపాటు చేతులు అందుకున్నాడు వాడు.

దెబ్బతిన్న పక్షిలాగా గౌరి అరిచినా, ఏడ్చినా వినిపించుకొనే మానవసంచారం లేని పొలం....సుబ్బడి బలం ముందు పదహారేళ్ళ గౌరి ఎంత.

పదిలమమ్మా చెల్లెమ్మా
పదహారేళ్ళొచ్చేయి....

తను పాడే పాటే వెక్కిరింతగా గుండెల్లో మ్రోగుతోంది. అలసిపోయి, ఓడిపోయి....గౌరి నేలకు జారిపోయింది.

*    *    *    *    *

'అమ్మా'

తన కళ్ళముందు కూలిపోయి, పాదాల మీద చేతులువేసిన గౌరిని ఆశ్చర్యంగా చూచింది కళ్ళజోడులోంచి, చేతిలో వున్నపుస్తకం క్రిందపడేసి.

"ఏమయిందే గౌరీ....ఏమిటమ్మా...." అనునయంగా అన్నది ఆ అమ్మాయిని లేవదీస్తూ.

అంతే....దుఃఖ ప్రవాహం కట్టదాటేసింది. తెగిపడిన ముత్యాలహారంలా ఆమె వడిలో చేరిపోయింది గౌరి.

"'''అమ్మా....మరమ్మా....రాత్రమ్మా...."

గౌరి చెపుతున్న నమ్మలేని కథ వింటోంది యశోద.

"అమ్మా....సాంబడు పోమన్నదమ్మ ఇంట్లోంచి. ఆడు నన్ను ఏలుకోనన్నాదమ్మా....నేనేం తప్పు జేశానమ్మా-"

వెక్కిళ్ళు పెడుతున్న గౌరిని చూస్తూ వుండిపోయింది.

తను పెంచుకున్న చిన్నారి పూలమొక్క
తను తీర్చి దిద్దిన రాగాల మాలిక
ఆ పిల్ల అంటరానిది....అని అనుకోలేదు.

ఏ క్షణం తనను అమ్మా అని పిలిచి, వాకిట్లోకి వచ్చిన మరుక్షణమే ఈ నల్లరాతి ప్రతిమ తన మనసులో చోటు చేసుకొంది. సాంబడి లాంటి అందమైన, వయసున్న, పైగా ఆ పిల్ల కులంలో పుట్టిన కుర్రాడు కోరి చేసుకుంటానని వస్తే, దగ్గరుండి పెండ్లి చేసింది. చేతులారా ఆ చిమ్మ చీకటిలోకి, కాపురం చేయమని పంపింది. తిరిగి ఆ పూల మాలిక తెగిన చెండులా తన వాకిట్లో వచ్చి పడింది. ఏ చట్టం....ఏ న్యాయం ఈ పిల్లను కాపాడి జీవితం, సౌరభం యిస్తుంది....యశోద కళ్ళమీద చేతులు వుంచుకుంది.

"ఓ కన్నీటి ముత్యమా....నువు బయటికి రాకు....
నాలోనే వుండిపో, నా ఆవేదనకు అర్థం
తెలిసిన నిన్ను నే నెలాపోనివ్వగలను...." (వనితాజ్యోతి, నవంబర్ 86)